


# గొప్ప ప్రేమగాథ

## (పరమగీతములు సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** పాత నిబంధనలో కావ్యగ్రంథాలలో పరమగీతములు చివరిది. యోబు గ్రంథం బాధ భరిత హృదయవర్ణనను, కీర్తనల గ్రంథం ఆరాధించే హృదయ లక్షణాలను, సామెతల గ్రంథం, జనసంచార స్థలాలలో ఉద్యోగాలు చేసే స్థలాలలో దైవ భక్తిగలవాని హృదయం ఎలా ఉండాలో తెలియజేస్తాయి. ప్రసంగి గ్రంథం, దైవ ప్రత్యక్షత లేని హృదయంలోని ప్రశ్నలు, సందేహాలు, ఆలోచనలను తెలియజేస్తుంది. పరమగీతాలు దేవుని బిడ్డల వైవాహిక సంబంధంలోని భావోద్వేగాలను వారు పొందే హృదయానందాన్ని వివరిస్తుంది.

**1. గ్రంథకర్త :** సొలొమోను 1005 గీతాలు రచించారు (I రాజు 4:32). మన కోసం లేఖానాలలో దాచి ఉంచబడినది ఇది ఒక్కటే. దీని శీర్షికను బట్టి ఇది శ్రేష్ఠమైన కావ్యం అని చెప్పవచ్చును.

**2. మూల పదాలు :** "ప్రియుడు" మరియు "ప్రియురాలు".

**మూల వచనాలు :** "నేను పద్మములలో మేపుచున్న నా ప్రియునిదానను, అతడును నావాడు" (6:3).

"అగాధ సముద్రజలము ప్రేమను ఆర్పజాలదు. నదీ ప్రవాహములు దాని ముంచివేయజాలవు" (8:7).

**గ్రంథ భావము :** ఇది పరలోక సత్యాన్ని భూలోక దృశ్యంతో వివరించే కావ్యం. దైవావేశము వలన వ్రాయబడి, ప్రమాణిక గ్రంథాలుగా నిర్ధారించబడిన లేఖనాలలో ఈ గ్రంథం ఉండకూడదని కొంత మంది అభిప్రాయం. కాని దేవుడు ఇది బైబిలులో చేర్చబడేందుకు అనుమతించాడు. అది ప్రమాణిక గ్రంథాలలో చేర్చబడినా నిర్లక్ష్యం చేయబడుతున్నది. తరచుగా పెద్దలు, యౌవన బోధకులు వివాహమునకు ముందు దానిని చదువకూడదని చెప్తూ ఉంటారు. యూదులు దానిని లేఖనాలన్నిటిలో పరిశుద్ధమైనదిగా ఎంచుతారు. ఓరిజెన్ మరియు జెరోమ్ అనే పండితులు చెప్పిన విషయం ఏమంటే, యూదులు తమ పిల్లలకు 30 సం॥ల వయస్సు వచ్చేంత వరకు ఈ గ్రంథాన్ని చదివేందుకు అనుమతించరు. సున్నితమైన పుష్పంలాంటి ఈ గ్రంథాన్ని సున్నితంగానే ఉపయోగించాలి.

ఈ గ్రంథంలో నాలుగు విభిన్న మరియు ముఖ్యమైన అర్థాలను కనుగొనవచ్చును.

**అ.** ఇది వైవాహిక ప్రేమ ఔన్నత్యాన్ని మన ముందు ఉంచుతుంది. వివాహము దైవికమైన వ్యవస్థ అని, వైవాహిక సంబంధంలోని పరిశుద్ధతను ప్రకటిస్తుంది. అకస్మాత్తుగా చూస్తే ఈ వాక్య భాగాలలో అశ్లీలత కనిపిస్తుంది. కాని ఈ కావ్యంలో సంతృప్తి చెందిన భర్త హృదయం మరియు సమర్పణ గల భార్య హృదయం కనిపిస్తుందని యూదుల తలంపు.

**ఆ.** ఈ గ్రంథం దేవునికి ఇశ్రాయేలుపై గల ప్రేమను కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. ప్రవక్తలు ఇశ్రాయేలు జాతిని యెహోవా దేవుని భార్యగా వర్ణించారు. ఈ గ్రంథాన్ని గూర్చిన ఈ రెండు తలంపులను, వ్యాఖ్యానాలను, ఇశ్రాయేలీయుల శాస్త్రులు మరియు పరిసయ్యులు ఆమోదించారు. క్రొత్త నిబంధన సంఘము కూడ ఆమోదించింది.

**ఇ.** పై రెండు అర్థాలు ఈ కావ్య గ్రంథానికి ఆపాదించబడినా, లేఖనాలలో సుపరిచితమైన క్రీస్తు మరియు సంఘమునకు మధ్య గల సంబంధాన్ని ఇది మనకు చిత్రీకరిస్తున్నది. (II కొరి 11:2; ఎఫె 5:27; ప్రక 21 అధ్యా) సంఘము క్రీస్తు వధువు.

**ఈ.** క్రీస్తుకు ప్రతి విశ్వాసితో గల వ్యక్తిగత సంబంధం యొక్క చిత్రీకరణ కూడ ఈ గ్రంథం ప్రత్యక్షపరుస్తుంది. క్రీస్తుతో విశ్వాసి ఆత్మ సంయోగాన్ని మన ఎదుట ఉంచుతుంది.

5. **గ్రంథ విశిష్టత :** పరమ గీతముల గ్రంథం పాఠకుని ఆధ్యాత్మిక శక్తి సామర్థ్యాలను పరీక్షిస్తుంది. క్రీస్తుతో మనకున్న వ్యక్తిగత సంబంధాన్ని అలంకార రూపంలో వర్ణించే ఈ కావ్యం మనం పాటించాల్సిన ప్రధానమైన ఆజ్ఞను జ్ఞాపకం చేస్తుంది (మత్త 22:35-40). సొలొమోను వ్రాసిన ఈ గీతము భావము, పునరుత్థానుడైన క్రీస్తుతో విశ్వాసికి గల సంబంధాన్ని గూర్చిన అన్వయము ఈ గ్రంథాన్ని బైబిలులో భక్తి ప్రదాయకమైన గ్రంథాలలో ఒకటిగా చేస్తుంది. పరమ గీతాలను ప్రకృతి సంబంధిగా కాక ఆత్మ సంబంధిగా ఆధ్యాత్మిక పునాదిపై నిలిచి చదవాలి. ఈ గ్రంథం కృపద్వారా మాత్రమే బోధించగల అనుభవాన్ని మరియు అనుభవం ద్వారా మాత్రమే నేర్చుకో గల స్థితిని వర్ణిస్తుంది.

6. **ఉద్దేశం :** లైంగిక ఇచ్ఛలు తప్పు అనే సాతాను అబద్ధాన్ని ఖండించి, అవి పవిత్రమైనవని, వివాహ బంధంలోనే అవి తీర్చబడాలని ఈ గ్రంథం నేర్పిస్తుంది.

B. **కథా సంగ్రహము :** ఈ కథ మూలాంశం పర.గీ. 8:11 లో కనిపిస్తుంది. ఎఫ్రాయిము ప్రాంతానికి చెందిన ఒక పేద కుటుంబగాథ ఇది. ఆ కుటుంబంలో ఉన్న ఒక అమ్మాయి వారి కుటుంబ ఆర్థిక స్థితిని బట్టి ద్రాక్షావనంలో పనిచేయడానికి బలవంతం చేయబడింది. అక్కడ ఆమె యౌవనస్థుడైన ఒక పసులకాపరిని కలుసుకొన్నది. వారి ప్రేమగాథను గూర్చి మొదట వివరించబడింది. అతడు కొంతకాలం ఆమెకు మరుగైపోయాడు. అయితే ఆమెను మళ్ళీ కలుసుకొంటానని వాగ్దానం చేసి వెళ్ళిపోయాడు. చాలాకాలం వరకు అతని కోసం నిరాశతో ఎదురు చూస్తూ ఉండగా ఒక రోజున ఆ మార్గంలో సొలొమోను మహారాజు వస్తున్నాడన్న వార్త మారుమ్రోగింది. సొలొమోను రాజు ఆమెను చూడాలనుకొంటున్నాడన్న సంగతి ఆమెకు చెప్పేంతవరకు, ఆమెను రాజు దగ్గరికి తీసుకొని వచ్చేంత వరకు ఆమె అంతగా ఆసక్తి చూపించలేదు, పట్టించుకోలేదు. సొలొమోను ఆమెను పిలుస్తున్నాడని చెప్పినా, సందిగ్ధంలోనే ఉండిపోయింది. అతని ఎదుటికి వచ్చాక, అతడు మరెవరోకాదని తాను ప్రేమించిన ఆ గొఱ్ఱెల కాపరే అని గుర్తుపట్టింది. అతడు యెరూషలేములోని తన అంతఃపురానికి ఆమెను తీసికొని వెళ్ళాడు. ఈ కావ్యంలోని నాటకీయ ఘట్టాలన్నీ యెరూషలేములో, కొన్ని ఘట్టాలు మందను మేపిన స్థలంలో జరిగాయి.

C. **అధ్యాయాల వారిగా సంక్షిప్త వివరణ :**

1. **మొదటి అధ్యాయం :** ఈ కావ్య నాటిక ఎఫ్రాయిములోని కొండ ప్రదేశమైన బాల్‌హామోన్ వద్ద ప్రారంభమౌతున్నది. యెరూషలేములోని అంతఃపురంలో ఉన్న వధువు, సొలొమోను ఒక పసులకాపరిగా తనను కలుసుకొన్నప్పటి దృశ్యాలను మననం చేసికొంటున్నది (1:2-4). అంతఃపురంలోని ఇతర కన్యకలతో పోలిస్తే ఈమె చాలా నల్లనిది. ద్రాక్షాతోటను కావలి కాసేందుకు తన అన్నలచే బలవంతంగా నియమించబడి, ఎండకు వాడిపోయినది (1:5). ఆమె స్వంత ద్రాక్షతోట ఆమె అందమే అని కొంత మంది అభిప్రాయం (1:6). ఆమె దానిని కాపాడుకోలేక పోయింది. మనం ప్రభువు తోటను కాయాలంటే మన తోటను కాయడం, అనగా మన ఆధ్యాత్మిక సౌందర్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం. ఇతరులకు సేవచేయుటలో నిమగ్నమై, ప్రభువుతో సహవాసంలో మన స్వంత అవసరత తీర్చబడాలన్న సత్యాన్ని మరిచిపోవద్దు. అయినా ఆ కాపరి ఆమెను ప్రేమించాడు. ఆమె చూచిన కాపరి గొఱ్ఱెలు ఈ కావ్యంలో ఎక్కడ కనిపించవు (1:7). తరువాత అతడే సొలొమోను అని ఆమె తెలిసికొన్నది (1:9-16). పెండ్లి కుమారుడు వధువును మొదట తన అంతఃపురంలోనికి తీసికొని వెళ్ళాడు. క్రీస్తుతో విశ్వాసులుగా మన సంబంధం బహిర్గతం కాక పూర్వం, అనగా బహిరంగముగా ప్రజలలోనికి వెళ్ళి ఆయనతో కలిసి పని చెయ్యక ముందు ఆయనతో వ్యక్తిగతంగా సహవాసం చెయ్యడం అవసరం. దానినే ప్రభువు కొండమీది ప్రసంగంలో సూచించాడు (మత్త 6:5-7).

2. **రెండవ అధ్యాయం:** వధువుతో ఏకాంతంగా గడిపిన తరువాత పెండ్లి కుమారుడు ఆమెను విందుశాలకు అనగా ప్రజలున్న బహిరంగ స్థలానికి తీసికొని వెళ్ళాడు. ఈ క్రమాన్ని ప్రతి విశ్వాసి గమనించి అలా అభ్యాసం చేసికోవాలి. అంతఃపురంలోని ఈ ప్రేమ దృశ్యంలో (2:1) వధువు తనలో తాను మాట్లాడుకొంటున్నది. తనను గూర్చి గొప్పగా చెప్పుకోలేదు గాని ఆ ప్రాంతానికి చెందిన అందమైన చిన్న పుష్పంతో తనను పోల్చుకొంటున్నది. పెండ్లి కుమారుడు ఆమె పట్ల తన ప్రేమను వ్యక్తం చేస్తు అందమైన పుష్పంలాంటి వధువు ముళ్ళలో ఉన్నదని వివరించాడు. క్రీస్తుతో విశ్వాసికి గల ఏ సంబంధమైనా విశ్వాసి పట్ల క్రీస్తుకున్న ప్రేమపై మరియు ఆయన పట్ల విశ్వాసికున్న ప్రేమపై ఆధారపడి ఉండాలి (2:2-7). స్వల్పకాల విరామం అనంతరం ప్రియుని పునరాగమనం కొరకు ప్రియురాలు కనిపెట్టిన వైఖరినే విశ్వాసులు కలిగి ఉండాలి. క్రీస్తు పునరాగమనం కొరకు కనిపెట్టాలి (2:8-17). ఈ భాగంలో మొదట పెండ్లి కుమారుని స్వరం వినిపించబడింది (2:8; యోహా 5:25; I థెస్స 4:16). 16వ వచనం విశ్వాసి క్రీస్తుతో ఎత్తబడే దృశ్యపు ఆధ్యాత్మిక ఔన్నత్య భావాన్ని వెల్లడిస్తుంది (I థెస్స 4:13-18).

రెండవ అధ్యాయంలో మరో ముఖ్యమైన సత్యాన్ని గమనించవచ్చు. పెండ్లి కుమారుడు వధువు ముఖాన్ని చూడాలని, ఆమె స్వరాన్ని వినాలన్న కోరికను వ్యక్తం చేస్తున్నాడు (2:14). సాధారణంగా ఒకవ్యక్తి పడకపై పడుకున్నప్పుడు ముఖాన్ని స్పష్టంగా చూడగలగుతాము. మనము ఇష్టపూర్వకంగా మన ముఖాన్ని ప్రభువుకు చూపించనప్పుడు, ఆయన మనకు అనారోగ్యాన్ని అనుమతించడం ద్వారా పడకపై ఉంచాల్సి వస్తుంది. అప్పుడే తిరిగి ఆయనతో సహవాసాన్ని పునరుద్ధరించుకో గలుగుతాము (యోబు 33:14-26). చిన్న చిన్న పాపాలు ప్రభువుతో మన సహవాసానికి అంతరాయం కలిగిస్తాయి. సహవాసమనే ద్రాక్షతోటను పాడుచేసే ఈ గుంటనక్కలను పట్టుకోవాలి (2:15).

3. **మూడవ అధ్యాయం :** ఈ భాగంలో వరుడు తనతో లేని సమయంలో వధువు అతని గూర్చి కలలు కనడం, రాత్రివేళ అతన్ని వెదికే సమయంలో కావలివారు ఎదురుపడడం, చివరికి కనుగొనడం చూస్తాము (3:1-3). సొలొమోను తన వధువుతో ఘనంగా యెరూషలేములో ప్రవేశించాడు (3:6-11).

4. **నాల్గవ అధ్యాయం :** ఈ అధ్యాయమంతటిలో పెండ్లి కుమారుని ప్రేమగీతం ఉంది. అందులో వధువు విషయం అతని ప్రగాఢమైన కోరిక మరియు బలమైన భారం వ్యక్తమౌతుంది (4:7 ను ఎఫెసీ 5:25-27 తో పోల్చి చూడండి). క్రీస్తు తనను ఎంతగా ప్రేమిస్తున్నాడో విశ్వాసి 4:9-11 ద్వారా గ్రహించవచ్చు. అలాగే విశ్వాసి ఎలా ఉండాలని కోరుతున్నాడో 4:12లో వ్యక్తం చేయబడింది. 16వ వచనంలో వధువు స్పందన కనిపిస్తున్నది.

5. **ఐదవ అధ్యాయం :** ఈ భాగంలో ప్రభువు జతపని వారిగా ఆయనతో మన సహవాసం ఉదహరించబడింది. తన పని నుండి విరమించిన వధువు విశ్రాంతి తీసికొంటున్నది. వరుడు తలుపు తట్టినప్పుడు అతని కంటె తన సుగంధ ద్రవ్యాలను గూర్చే శ్రద్ధ వహించింది (5:1-6). విశ్వాసులకు ప్రభువు ఇచ్చిన కృపావరాలతో ప్రస్తుతం సంఘము పలు కార్యకలాపాలలో నిమగ్నమైపోయి, వాటిని ఇచ్చిన వానిని మర్చిపోతున్నది. నిద్రావస్థలో ఉన్నది. క్రీస్తు రాకడకు సిద్ధంగా ఉండాలి. వరుడు ఆమెను వెదకినప్పుడు ఆమె నిద్రపోతున్నది, తలుపు తెరువలేదు. అతడు వెళ్ళిపోయాక అతన్ని వెదుకుతూ వెళ్తున్నది (5:7,8). ఈ సంబంధం తెగిపోవడంలో పెండ్లికుమారుని ప్రమేయం ఏమి లేదు. క్రీస్తుతో మన సంబంధం ఎడతెగని సహవాసంగా ఉండాలి. దానిని మనమే తెంపుకొనే ప్రమాదం ఉంది కనుక జాగ్రత్తపడాలి. సాధారణంగా మన బాధ్యతలలో లేక ఆత్మవరాల పరిచర్యలో మునిగిపోయి ఆ వరాలను దయచేసిన ఆయనతో మన సంబంధాన్ని ఉపేక్షిస్తాము. మన సహవాసాన్ని అపేక్షిస్తు ద్వారం వెలుపల వేచి ఉన్న పెండ్లి కుమారుణ్ణి విస్మరిస్తాము. ఆమె అతని గూర్చి విచారణ చేస్తూ యెరూషలేము కుమార్తెలతో అతని గూర్చి వర్ణిస్తున్నది. 9వ వచనంలోని వ్యక్తులు అపనమ్మకస్తులు, పరమత ద్వేషులైన మతాసక్తులకు సాదృశ్యంగా ఉన్నారు. వీరు విశ్వాసులను క్రీస్తు ఎవరు? ఇతర మత సంస్థాపకులకు ఆయనకు ఏదైనా వ్యత్యాసం ఉందా? అని ప్రశ్నిస్తారు. 5:10-16 లో వరుని గూర్చిన వివరణాత్మక, మహిమాన్విత వర్ణన కనిపిస్తుంది. ఆ వర్ణణలలో వధువు, తాను తన వరుణ్ణి బాగా ఎరుగును అని, అతన్ని ప్రత్యేకమైన వ్యక్తిగా ఎంచుతున్నదని, అమితంగా ప్రేమిస్తున్నదని వ్యక్తం చేస్తున్నది.

6. **ఆరవ అధ్యాయం :** షూలమ్మీతి మహిమాన్వితమైన వర్ణనకు యెరూషలేము కుమార్తెలు ముగ్దులయ్యారు (6:1-3). కాబట్టి అవిశ్వాసము నుండి విశ్వసించే స్థితికి వచ్చారు. మనము క్రీస్తును గూర్చి వివరించే విధానాన్ని బట్టి అవిశ్వాసులు విశ్వాసులుగా మారతారు. ఈ భాగంతో పాటు చాల వచనాలలో, వీరిద్దరి సహవాసం మందలను మేపడముతో సంబంధం కలిగి ఉన్నది (6:3; 1:7,8). మనము ప్రభువుతో సన్నిహిత సహవాసం కలిగి ఉండాలంటే ఆయనకు ఇష్టమైనదే చెయ్యాలి. అనగా ఆయన గొఱ్ఱెలను మేపాలి. గొఱ్ఱెపిల్లలను కాయాలి (యోహా 21:15-18). 6:4-10 లో వధువుపైన వరునికున్న ప్రేమానురాగాలు, 11, 12 వచనాలలో వధువు ప్రతిస్పందన, 13వ వచనంలో యెరూషలేము కుమార్తెల ప్రతిస్పందన వ్రాయబడింది.

7. **ఏడవ అధ్యాయం** : ఈ అధ్యాయంలో వధువు సౌందర్యాన్ని యెరూషలేము కుమార్తెలు వర్ణించడం గమనార్హం. సంఘము తనను గూర్చి తాను గొప్పలు చెప్పుకోవడం కన్న లోకం దానిని మెచ్చుకోవడం ముఖ్యం. సొలొమోను గీతంలోని వధువు పెండ్లి కుమారుని పనిని అర్థం చేసుకొన్నది. కలిసి పని చేసింది (7:12). మిగతా భాగంలో వధూవరుల స్వచ్ఛమైన ప్రేమవర్ణన వ్రాయబడింది.

8. **ఎనిమిదవ అధ్యాయంలో** : పెళ్ళికుమారుడు ప్రేమను గూర్చి చెప్పి ఈ గీతాన్ని ముగించాడు. ఈ సుందర కావ్యంలో ప్రేమ పలు విధాలుగా వర్ణించబడింది. ఈ అగాపే ప్రేమలోని ప్రతి లక్షణాన్ని, క్రీస్తుతో మనకు గల సంబంధంలో కూడ అన్వయించుకోవాలి. ఈ ప్రేమ, రహస్యమైనది, అన్యోన్యమైనది, విశేషమైనది, గాఢమైనది, నిస్వార్థమైనది, పరస్పరముండేది, సంతృప్తినిచ్చేది, మేలు కలిగించేది, భయముతో కూడినది, ఫలభరితమైనది, ఎవరూ ఆర్పజాలనిది, శాశ్వతమైనది. ఈ భాగం, దేవుని ప్రేమను గూర్చిన పౌలు వర్ణనను జ్ఞాపం చేస్తున్నది (I కొరి 13 అధ్యా). అగాపే ప్రేమ అనగా అసమానమైనది, సాటిలేనిది, ఏ షరతులేనిది. ఇది ఎవ్వరూ నిరోధించలేనిది. విశ్వాసులకు ప్రేరణనిచ్చే ప్రేమ ఇది. ఈ ప్రేమ ఎన్నడూ నిరర్థం కాదు.

D. **ముగింపు :** మన పట్ల క్రీస్తు ప్రేమను గూర్చి ఆయన ప్రేమకు మన ప్రతి స్పందనను గూర్చి పరమగీతాలు ప్రేమభాషలో చెప్తుంది. అద్వితీయమైన ఈ ప్రేమ లక్షణాన్ని అర్థం చేసికోడానికి మనము దేవుని ప్రేమతో ప్రారంభించాలి. ఈ ప్రేమ ఆత్మానుసారుల హృదయ పట్టకము (Prism) ద్వారా ప్రసరించి, సుగుణాల గుత్తిగా బయటికి ప్రసరిస్తుంది (I కొరి 13 అధ్యా; I యోహా 4:7-21).

ఇటువంటి ప్రేమ మనలో ఉంటే తల్లిదండ్రులను, జీవిత భాగస్వామిని, పిల్లలను ఇక ప్రేమించడం కష్టం అనుకొన్నవారిని సహితం ప్రేమించే శక్తిని కలిగి ఉ ంటాము. అట్టి కృప ప్రభువు మనకు దయచేయును గాక!